# 2 సమూయేలు 19వ అధ్యాయము

1 రాజు తన కుమారునిగూర్చి దుఃఖించుచు ఏడ్చుచున్నాడను సంగతి ఆ దినమున జనులందరు విని, 2
యుద్ధమందు సిగ్గుతో పారిపోయిన జనులవలె వారు నాడు దొంగనడకలతో వచ్చి పట్టణములో ప్రవేశించిరి; 3
నాటి విజయము జనులకందరికి దుఃఖమునకు కారణమాయెను. రాజు ముఖము కప్పుకొని – అబ్షాలోమా నా
కుమారుడా అబ్షాలోమా నా కుమారుడా నా కుమారుడా, అని కేకలు వేయుచు ఏడ్చుచుండగా, 4 రాజు అబ్షాలోమును
గూర్చి దుఃఖించుచు ఏడ్చుచున్నడను సంగతి యోవాబు విని నగరియందున్న రాజునొద్దకు వచ్చి 5 – నీ ప్రాణమును
నీ కుమారుల ప్రాణములను నీ కుమార్తెల ప్రాణములను నీ భార్యల ప్రాణములను నీ ఉపపత్నుల ప్రాణములను
ఈ దినమున రక్షించిన నీ సేవకుల నందరిని నేడు సిగ్గుపరచి 6 నీ స్నేహితుల యెడల ప్రేమ చూపక నీ
శత్రువుల యెడల ప్రేమ చూపుచు, ఈ దినమున అధిపతులును సేవకులును నీకు ఇష్టజనులు కారని నీవు
కనుపరచితివి. మేమందరము చనిపోయి అబ్షాలోము బ్రదికియుండిన యెడల అది నీకు ఇష్టమగునన్న మాట
యీ దినమున నేను తెలిసికొనుచున్నాను. ఇప్పుడు లేచి బయటికివచ్చి నీ సేవకులను ధైర్యపరచుము. 7 నీవు
బయటికి రాకయుండిన యెడల ఈ రాత్రి యొకడును నీయొద్ద నిలువడని యెహోవా నామమునుబట్టి ప్రమాణముచేసి
చెప్పుచున్నాను; నీ బాల్యమునుండి నేటివరకు నీకు ప్రాప్తించిన అపాయము లన్నిటికంటె అది నీకు కష్టతరముగా
ఉండునని రాజుతో మనవిచేయగా రాజు లేచి వచ్చి గుమ్మములో కూర్చుండెను. 8 రాజు గుమ్మములో కూర్చున్నాడను
మాట జనులందరు విని రాజును దర్శింప వచ్చిరిగాని ఇశ్రాయేలువారు తమ తమ యిండ్లకు పారిపోయిరి. 9
అంతట ఇశ్రాయేలువారి గోత్రమునకు చేరికైన జనులందరు ఇట్లనుకొనిరి – మన శత్రువుల చేతిలోనుండియు,
ఫిలిష్తీయుల చేతిలో నుండియు మనలను విడిపించిన రాజు అబ్షాలోమునకు భయపడి దేశములోనుండి
పారిపోయెను. 10 మనమీద మనము రాజుగా పట్టాభిషేకము చేసిన అబ్షాలోము యుద్ధమందు మరణమాయెను.
కాబట్టి మనము రాజును మరల తోడుకొని వచ్చుటనుగూర్చి ఏల మాట్లాడకపోతిమి? 11 రాజైన దావీదు ఇది విని
యాజకులగు సాదోకునకును అబ్యాతారునకును వర్తమానము పంపి – ఇశ్రాయేలువారందరు మాటలాడుకొను
సంగతి నగరిలోనున్న రాజునకు వినబడెను గనుక రాజును నగరికి మరల తోడుకొని రాకుండ మీరెందుకు
ఆలస్యము చేయుచున్నారు? 12 మీరు నాకు ఎముక నంటినట్టియు మాంసము నంటినట్టియు సహోదరులైయుండగా
రాజును తోడుకొని రాకుండ మీరెందుకు ఆలస్యము చేయుచున్నారని యూదావారి పెద్దలతో చెప్పుమని ఆజ్ఞ
ఇచ్చెను. 13 మరియు అమాశా యొద్దకు దూతలను పంపి – నీవు నాకు ఎముకనంటిన బంధువుడవు మాంసము
నంటిన బంధువుడవు కావా? యోవాబునకు బదులు నిన్ను సైన్యాధిపతిగా నేను ఖాయపరచని యెడల దేవుడు
గొప్ప అపాయము నాకు కలుగజేయును గాకని చెప్పుడనెను. 14 అతడు పోయి యెవరును తప్పకుండ
యూదావారినందరిని రాజునకు ఇష్టపూర్వకముగా లోబడునట్లు చేయగా – నీవును నీ సేవకులందరును మరల
రావలెనన్న వర్తమానము వారు రాజునొద్దకు పంపిరి. రాజు తిరిగి యొర్దాను నదియొద్దకు రాగా 15 యూదావారు
రాజును ఎదుర్కొనుటకును రాజును నది యివతలకు తోడుకొని వచ్చుటకును గిల్గాలునకు వచ్చిరి. 16 అంతలో

బహూరీమునందున్న బెన్యామీనీయుడగు గెరా కుమారుడైన షిమీ త్వరపడి రాజైన దావీదును ఎదుర్కొనుటకై
యూదావారితో కూడ వచ్చెను. 17 అతని యొద్ద వెయ్యిమంది బెన్యామీనీయులు ఉండిరి మరియు సౌలు
కుటుంబమునకు సేవకుడగు సీబాయును అతని పదునయిదుగురు కుమారులును అతని యిరువదిమంది దాసులను
వచ్చి 18 రాజు ఎదుట నది దాటిరి; రాజు ఇంటివారిని అవతలకు దాటించుటకును రాజు దృష్టికి అనుకూలమైన
దానిని చేయుటకును రేవుపడవను ఇవతలకు తెచ్చియుండిరి. అంతట గెరా కుమారుడగు షిమీ వచ్చి రాజు
యొర్దానునది దాటిపోగానే అతనికి సాష్టాంగపడి 19 – నా యేలినవాడా, నేను చేసిన ద్రోహము నామీద
మోపకుము; నా యేలినవాడవును రాజవునగు నేను మూర్ఖించి చేసిన దోషమును జ్ఞాపకముందుంచకుము,
మనస్సునందుంచు కొనకుము. 20 నేను పాపము చేసితినని నాకు తెలిసినది గనుక యోసేపు వారందరితోకూడ
నా యేలినవాడవును రాజవునగు నిన్ను ఎదుర్కొనుటకై నేను ముందుగా వచ్చియున్నానని నెను. 21 అంతట సెరూయా
కుమారుడగు అబీషై – యెహోవా అభిషేకించినవానిని శపించిన యీ షిమీ మరణమునకు పాత్రుడు కాడా అని
యనగా 22 దావీదు – సెరూయా కుమారులారా, మీకును నాకును ఏమిపొందు? ఇట్టి సమయమున మీరు
నాకును ఏమిపొందు? ఇట్టి సమయమున మీరు నాకు విరోధులగుదురా? ఇశ్రాయేలువారిలో ఎవరైనను ఈ
దినమున మరణశిక్ష నొందుదురా? యిప్పుడు నేను ఇశ్రాయేలువారిమీద రాజు నైతినను సంగతి నాకు
తెలిసేయున్నదని చెప్పి ప్రమాణము చేసి 23 – నీకు మరణశిక్ష విధింపనని షిమీతో సెలవిచ్చెను. 24 మరియు
సౌలు కుమారుడగు మెఫీబోషెతు రాజును నెదుర్కొనుటకు వచ్చెను. రాజు పారిపోయిన దినము మొదలుకొని
అతడు సుఖముగా తిరిగి వచ్చిన నాటివరకు అతడు కాళ్లు కడుగుకొనకయు, గడ్డము కత్తిరించు కొనకయు
బట్టలు ఉదుకుకొనకయు నుండెను. 25 రాజును ఎదుర్కొనుటకై అతడు యెరూషలేమునకు రాగా రాజు –
మెఫీబోషెతూ, నీవు నాతోకూడ రాకపోతివేమని అతని నడిగెను 26 అందుకతడు – నా యేలినవాడా రాజా, నీ
దాసుడనైన నేను కుంటివాడను గనుక గాడిదమీద గంత కట్టించి యెక్కి రాజుతో కూడ వెళ్లిపోదునని నేనుకొనగా
నా పనివాడు నన్ను మోసము చేసెను. 27 సీబా నీ దాసుడనైన నన్ను గూర్చి నా యేలినవాడవును రాజవునగు
నీతో అబద్ధమాడెను. అయితే నా యేలినవాడవును రాజవునగు నీవు దేవదూత వంటివాడవు, నీ దృష్టికి ఏది
యనుకూలమో దాని చేయుము. 28 నా తండ్రి యింటివారందరు నా యేలినవాడవును రాజవునగు నీ దృష్టికి
మృతుల వంటివారై యుండగా, నీవు నీ బల్ల యొద్ద భోజనము చేయువారిలో నీ దాసుడనైన నన్ను చేర్చితివి.
కాబట్టి ఇకను రాజవైన నీకు మొఱ్ఱపెట్టుటకు నాకేమి న్యాయమని అనగా 29 రాజు – నీ సంగతులను నీవిక
ఎందునకు ఎత్తెదవు? నీవును సీబాయయును భూమిని పంచుకొనుడని నేనాజ్ఞ ఇచ్చితిని గదా అనెను. 30 అందుకు
మెఫీబోషెతు – నా యేలినవాడవగు నీవు నీ నగరికి తిరిగి క్షేమముగా వచ్చియున్నావు గనుక అతడు అంతయు
తీసికొనవచ్చుననెను. 31 మరియు గిలాదీయుడగు బర్జిల్లయి రోగెలీయునుండి 31 యొర్దాను అద్దరికి వచ్చి
రాజుతో కూడ నది దాటెను. 32 బర్జిల్లయి యెనుబది సంవత్సరముల వయస్సు కలిగి బహు ముసలివాడై
యుండెను. అతడు అధిక ఐశ్వర్యవంతుడు గనుక రాజు మహనయీములో నుండగా అతనికి భోజన పదార్థములను
పంపించుచు వచ్చెను. 33 యెరూషలేములో నాయొద్ద నిన్ను నిలిపి పోషించెదను, నీవు నాతోకూడ నది దాటవలెనని
రాజు బర్జిల్లయితో సెలవియ్యగా 34 బర్జిల్లయి – రాజవగు నీతోకూడ యెరూషలేమునకు వచ్చుటకుఇక నేనెన్ని

దినములు బ్రతుకబోవుదును?35 నేటికి నాకు ఎనుబది యేండ్లాయెను. సుఖదుఃఖములకున్న భేదమును నేను
గుర్తింపగలనా? అన్నపానముల రుచి నీ దాసుడనైన నేను తెలిసికొనగలనా? గాయకుల యొక్కయు
గాయకురాండ్రయొక్కయు స్వరము నాకు వినబడునా? కావున నీ దాసుడనగు నేను నా యేలినవాడవును రాజవునగు
నీకు ఎందుకు భారముగా నుండవలెను?36 నీ దాసుడనైన నేను నీతోకూడ నది దాటి అవతలకు కొంచెము
దూరము వచ్చెదనుగాని రాజవగు నీవు నాకంత ప్రత్యుపకారము చేయనేల?37 నేను నా ఊరియందుండి మరణమై
నా తల్లిదండ్రుల సమాధియందు పాతిపెట్టబడుటకై అచ్చటికి తిరిగిపోవునట్లు నాకు సెలవిమ్ము, చిత్తగించుము, నీ
దాసుడగు కింహాము నా యేలినవాడవును రాజవునగు నీతోకూడ వచ్చుటకు సెలవిమ్ము; నీ దృష్టికి ఏది యనుకూలమో
దానిని అతనికి చేయుమని మనవి చేయగా 38 రాజు – కింహాము నాతోకూడ రావచ్చును, నీ దృష్టికి అనుకూలమైన
దానిని నేను అతనికి చేసెదను, మరియు నా వలన నీవు కోరునదంతయు నేను చేసెదనని సెలవిచ్చెను. 39
జనులందరును రాజును నది యవతలకు రాగా రాజు బర్జిల్లయిని ముద్దు పెట్టుకొని దీవించెను; తరువాత
బర్జిల్లయి తన స్థలమునకు వెళ్లిపోయెను. 40 యూదా వారందరును ఇశ్రాయేలువారిలో సగము మందియు
రాజును తోడుకొని రాగా రాజు కింహామును వెంటబెట్టుకొని గిల్గాలునకు వచ్చెను. 41 ఇట్లుండగా ఇశ్రాయేలు
వారందరును రాజునొద్దకు వచ్చి – మా సహోదరులగు యూదావారు ఎందుకు నిన్ను దొంగిలించుకొని, నీ
యింటివారిని నీ వారిని యొర్దాను ఇవతలకు తోడుకొని వచ్చిరని యడుగగా 42 యూదా వారందరు – రాజు
మాకు సమీపబంధువుడై యున్నాడు గదా, మీకు కోపమెందుకు? ఆలాగుండినను, మాలో ఎవరైనను రాజు
సొమ్ము ఏమైనను తింటిమా? మాకు యీనాము ఏమైన ఇచ్చెనా? అని ఇశ్రాయేలువారితో అనిరి. 43 అందుకు
ఇశ్రాయేలువారు – రాజులో మాకు పదిభాగములున్నవి; మీకంటె మేము దావీదునందు అధిక స్వాతంత్ర్యము
గలవారము; రాజును తోడుకొని వచ్చుటను గురించి మీతో ముందుగా మాటలాడినవారము మేమే గదా మీరు
మమ్మును నిర్లక్ష్యము చేసితిరేమి? అని యూదా వారితో పలికిరి. యూదావారి మాటలు ఇశ్రాయలువారి మాటలకంటె
కఠినముగా ఉండెను.